



గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

‘చెత్త’ చేసేశారు!





కాకినాడ కార్పొరేషన్‌లో నిలిచిపోయిన చెత్తసేకరణ వాహనాలు.. పేరుకున్న చెత్త

జిల్లావ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో చెత్త సేకరణ సమస్యగా మారుతోంది. ఏ రోజుకారోజు ఇంటింటా చెత్త సేకరణ జరగాల్సి ఉండగా, పేరుకుపోయిన బిల్లులు, మూలన పడ్డ బ్యాటరీ వాహనాలతో సమస్య జటిలంగా మారుతోంది. ప్రధానంగా కాకినాడ నగర వ్యాప్తంగా రెండు రోజులుగా చెత్తసేకరణ వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. రూ.4.50 కోట్లకుపైగా కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చూసీచూసీ చివరకు కాంట్రాక్టర్ ఆ వాహనాలన్నింటినీ మూలకు పంపేశారు. దీంతో ఎక్కడికక్కడ నగరంలో చెత్త పేరుకుపోతోంది. అసలే వర్షాకాలం కావడంతో ఇంటింటా చెత్త సేకరణ, వార్డుల్లో చెత్త తొలగించకపోతే ఎక్కడ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందోనని జనం బెంబేలెత్తుతున్నారు. అటు కార్పొరేషన్ అధికారులేమో చెత్త పన్ను వసూళ్లు నిలిచిపోవడంతో చేతిలో చెల్లిగవ్వలేక బిల్లులు ఇవ్వలేక పోతున్నట్టు చెబుతున్నారు. సాధారణ నిధుల నుంచి చెల్లింపులు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి లేదంటున్నారు. కాగా చెత్త పన్ను వసూళ్ల ద్వారా చెత్త సేకరణ వాహనాలకు బిల్లులు చెల్లింపు చేయాలన్న గత ప్రభుత్వ అర్థరహిత విధానంతో ఈ సమస్యలు తెచ్చి పెడుతోంది. మరోపక్క చెత్త పన్ను జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లోను గత వైసీపీ ప్రభుత్వం పంపించిన చెత్త సేకరణ బ్యాటరీ వాహనాలు ఏడాదికే పనిచేయడం మానేశాయి. దీంతో ఇక్కడా చెత్త సేకరణ తూతూమంత్రంగా జరుగుతోంది.

- కాకినాడ నగరంలో నిలిచిపోయిన ఇంటింటా చెత్తసేకరణ
- రెండు రోజులుగా 72 చెత్త సేకరణ వాహనాలు ఎక్కడికక్కడ నిలిపివేత
- రూ.4.50 కోట్లకుపైగా బకాయి ఉండడంతో వాహనాలను పంపని కాంట్రాక్టర్
- చివరకు పెట్రోల్, సీఎన్‌జీ కొట్టించడానికీ బిల్లు ఇవ్వలేని స్థితిలో కార్పొరేషన్
- చెత్త పన్ను వసూలు డబ్బులు నిలిచిపోవడంతో నిధులు లేవంటున్న అధికారులు
- జనరల్ ఫండ్ నుంచి ఖర్చుచేద్దామన్నా రూ.67 కోట్ల అప్పుల్లో కార్పొరేషన్
- గత వైసీపీ సర్కారు చెత్త పన్ను వసూళ్లతోనే బిల్లుల చెల్లింపు మెలికతో చిక్కులు
- మరో రెండ్రోజులు ఇలాగే ఉంటే నగరం నిండా చెత్త పేరుకుపోయే ప్రమాదం
- వర్షాకాలం కావడంతో వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉందని ఆందోళన
- మరోపక్క మున్సిపాల్టీల్లో గత వైసీపీ సర్కారు పంపిన చెత్త సేకరణ బ్యాటరీ వాహనాలన్నీ మూలకు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 1.12 లక్షల గృహాలున్నాయి. వీటి నుంచి రోజూ వేలాది టన్నుల చెత్త పేరుకుంటోంది. ఈ చెత్తను ఏరోజుకారోజు చెత్తసేకరణ వాహనాలు ఇంటింటికి వచ్చి సేకరించుకు వెళ్తాయి. ఇందుకోసం మొత్తం నగరంలో 106 వాహనాలు తిరుగుతాయి. ఈ వాహనాలకు అయ్యే ఖర్చు, సిబ్బంది జీతభత్యాలన్నీ నెలనెలా కార్పొరేషన్ సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించాలి. ఈ నిధులను నగర వ్యాప్తంగా ఇళ్లు, వాణిజ్య దుకాణాల నుంచి వసూలు చేసే చెత్త పన్ను నుంచే కార్పొరేషన్ ఇంతవరకు చెల్లిస్తోంది. అయితే ఈ ఏడాది జనవరి నుంచి అధికారులు కార్పొరేషన్ పరిధిలో చెత్త పన్ను వసూలును నిలిపివేశారు. పన్ను వసూలుపై జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తంకావడం, అటు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడడంతో గత వైసీపీ ప్రభుత్వం పన్ను వసూలుకు భయపడింది. దీంతో అప్పటి నుంచి కార్పొరేషన్‌కు బిల్లుల చెల్లింపు సమస్యగా మారింది. ఫలితంగా చెత్త సేకరణ వాహనాల కాంట్రాక్టర్‌కు అధికారులు డబ్బులు ఇవ్వడం నిలిపివేశారు. వాస్తవానికి నెలకు 106 చెత్తసేకరణ వాహనాలకు ఒక్కో దానికి రూ.54 వేల చొప్పున కాంట్రాక్టర్‌కు కార్పొరేషన్ చెల్లించాలి. అంటే నెలకు అన్ని వాహనాలకు కలిపి రూ.57.24 లక్షల వరకు బిల్లు అవుతోంది. అదే సమయంలో నెలనెలా చెత్త పన్ను వసూళ్ల ద్వారా నగరంలో కార్పొరేషన్‌కు రూ.52 లక్షల వరకు సమకూరేది. ఇలా చెత్త పన్ను వసూలు డబ్బులు బిల్లు కింద జమయిపోయేది. కానీ జనవరి నుంచి పన్ను వసూలు లేకపోవడంతో కార్పొరేషన్‌కు బిల్లుల చెల్లింపు అసాధ్యంగా మారింది. కానీ గత వైసీపీ సర్కారు ఇదేదీ పట్టించుకోలేదు. అయితే జనవరి నుంచి ఇప్పటివరకు బాకీలు రూ.4.50 కోట్ల వరకు పేరుకుపోవడంతో చూసీచూసీ కాంట్రాక్టర్ రెండు రోజుల నుంచీ చెత్త సేకరణ వాహనాలను, సిబ్బందిని పంపించడం మానేశారు. ఫలితంగా నగరంలో రెండు రోజులుగా ఎక్కడికక్కడ ఇంటింటా చెత్త సేకరణ నిలిచిపోయింది. 106 వాహనాలకుగాను 72 వరకు వాహనాలు ఆగిపోయాయి. శుక్రవారం నుంచి మిగిలిన వాహనాలు కూడా అదే దారిలో నడవనున్నాయి. వాస్తవానికి గడచిన రెండు నెలలుగా పేరుకుపోయిన బిల్లులు తర్వాత ఇస్తామని చెబుతున్న కార్పొరేషన్ అధికారులు చెత్త సేకరణ వాహనాలకు పెట్రోల్, సీఎన్‌జీ కొట్టించేవారు. చివరకు వాటికి కూడా నిధులు లేకపోవడంతో తాజాగా పూర్తిగా చేతులెత్తేశారు. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. అయితే ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. అసలే ఎక్కడికక్కడ దోమల ముప్పు పెరిగి డెంగీ ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణ ఇళ్ల నుంచి వార్డుల నుంచి జరగకపోతే ప్రమాదం మరింత పెరుగుతుందనే భయం జనం నుంచి వ్యక్తమవుతోంది. పైగా మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇళ్లు, వీధుల్లో చెత్త కుప్పలు పెరిగి దుర్గంధం వెలువడే ప్రమాదం పొంచి ఉంది. నగర వ్యాప్తంగా చెత్త సేకరణ నిలిచిపోవడంతో తామేం చేయలేమని కార్పొరేషన్ అధికారులు చేతులెత్తేస్తున్నారు. కాంట్రాక్టరుకు బిల్లులు కోట్లలో పేరుకుపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదని చెబుతున్నారు. చెత్తపన్ను వసూళ్ల డబ్బులు లేకపోవడంతో సాధారణ ఫండ్స్ నుంచి వెచ్చించే అవకాశం ఉన్నా నిధులు నిండుకున్నాయని చెబుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం తన రకరకాల అవసరాలకు కార్పొరేషన్ నిధులను లాగేసుకుంది. ఇవ్వాల్సిన బాకీలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. దీంతో కాంట్రాక్టర్లకు కార్పొరేషన్ రూ.67 కోట్ల వరకు బిల్లులు బకాయి పడింది. అయితే ఇప్పుడు చెత్త వాహనాలకు బాకీలు చెల్లించడానికి జనరల్ ఫండ్ నుంచి ఎంతోకొంత సర్దుబాటు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం అనుమతించాలి. ఒకవేళ సర్దుబాటు చేస్తే తిరిగి ఆ డబ్బు ఇస్తామని చెప్పాలి. కానీ మున్సిపల్ ఉన్నతాధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో ఇక్కడి కార్పొరేషన్ అధికారులు ఏంచేయాలో తెలీక మిన్నకుండిపోయారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం చెత్త సేకరణ వాహనాలకు అయ్యే ఖర్చును చెత్తపన్ను వసూలు ద్వారా చెల్లించాలనే మెలిక పెట్టడం దారుణం. వేరే హెడ్ నుంచి నిధులు సర్దుబాటు చేసే అవకాశం ఉన్నా చేయకపోవడంతో ఇప్పుడు సమస్యలు తెచ్చిపెడుతోంది.

మున్సిపాల్టీల్లో మరీను..

గత వైసీపీ ప్రభుత్వం మున్సిపాల్టీల పరిధిలో ఇంటింటా చెత్తసేకరణ కోసం గతేడాది స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి బ్యాటరీ వాహనాలను పంపించింది. ఒక్కో వాహనం రూ.4 లక్షల చొప్పున కొనుగోలు చేసింది. తీరా ఇవి కొన్ని నెలల నుంచి మూలనపడ్డాయి. బయటకు తీద్దామంటే ఏవీ స్టార్ట్ అవడం లేదు. కొన్నింటికి బ్యాటరీలు పనిచేయకపోవడం, మరి కొన్నింటికి గేరు బాక్సులు పనిచేయకపోవడంతో ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా మారాయి. సామర్లకోట మున్సిపాల్టీ పరిధిలో 8, పెద్దాపురం 8, తుని మున్సిపాల్టీలో ఏడు వాహనాలు మూలనపడ్డాయి. దీంతో పట్టణాల్లో చెత్త సేకరణ సమస్యగా మారింది. అయితే అధికారులు తాత్కాలికంగా మున్సిపాల్టీ ట్రాక్టర్లలో చెత్త సేకరణ చేపడుతున్నా మొక్కుబడిగానే జరుగుతోంది. పోనీ మూలనపడ్డ బ్యాటరీ చెత్త వాహనాలను మరమ్మతు చేయించాలనుకున్నా వాటి విడిభాగాలు రాష్ట్రంలోనే దొరికే పరిస్థితి లేకపోవడంతో ఏంచేయాలో తెలియక అధికారులు తలపట్టుకుంటున్నారు.

తెలుగు భాష ఔన్నత్యానికి ‘గిడుగు’ విశేష కృషి

జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 29: తెలుగు భాష ఔన్నత్యానికి వాడుక భాషాయోధుడు, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు విశేష కృషిచేశారని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ గ్రాంధిక భాష వల్ల ప్రజలకు పడుతున్న ఇబ్బందులను గమనించి వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు నాంది పలికారన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజుని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

జిల్లాకు రూ.116 కోట్లు కేటాయింపు

పంపిణీకి సర్వం సిద్ధం : జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 29: జిల్లాలో ఈనెల 31వ తేదీనే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో దానికి ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో 2,76,693 మంది పింఛన్‌దారులకు రూ.116.43 కోట్లు నిధులు కేటాయించారు. దీనిలో గండేపల్లి మండలానికి రూ.3.63 కోట్లు, గొల్లప్రోలు రూరల్ రూ.3.30 కోట్లు, గొల్లప్రోలు అర్బన్ రూ.1.23 కోట్లు, జగ్గంపేటకు రూ.5.21 కోట్లు నిధులు కేటాయించారు. అలాగే కాజులూరు మండలం రూ.4.18 కోట్లు, కాకినాడ రూరల్ రూ.7.63 కోట్లు, కాకినాడ అర్బన్ రూ.12.79 కోట్లు నిధులు ఇస్తున్నారు. కరప మండలం రూ.4.81 కోట్లు, కిర్లంపూడి రూ.4.81 కోట్లు, కోటనందూరు రూ.3.32 కోట్లు, కొత్తపల్లి రూ.5.21 కోట్లు, పెదపూడి రూ.4.30 కోట్లు, పెద్దాపురం రూరల్ రూ.4.92 కోట్లు, పెద్దాపురం అర్బన్ రూ.2.58 కోట్లు, పిఠాపురం రూరల్ రూ.4.66 కోట్లు, పిఠాపురం అర్బన్ రూ.2.43 కోట్లు ఇచ్చారు. ప్రత్తిపాడు మండలం రూ.4.96 కోట్లు, రౌతులపూడి రూ.3.43 కోట్లు, సామర్లకోట రూరల్‌కు రూ.4.90 కోట్లు ఇచ్చారు. సామర్లకోట అర్బన్ రూ.2.73 కోట్లు, శంఖవరం మండలం రూ.3.22 కోట్లు, తాళ్లరేవు మండలానికి రూ.4.83 కోట్లు, తొండంగి రూ.5.31 కోట్లు, తుని రూరల్ రూ.5.25 కోట్లు, తుని అర్బన్ రూ.2.34 కోట్లు, ఏలేశ్వరం రూరల్ రూ.2.87 కోట్లు, ఏలేశ్వరం అర్బన్‌కు రూ.1.60 కోట్లు నిధులు కేటాయించారు. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు పంపిణీ చేయనున్నారు. తొలి రోజే నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు.





కాకినాడలో గురువారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్.. మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ

క్రీడాకారులకు దేహదారుఢ్యం ఉండాలి

జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ అర్బన్, ఆగస్టు 29: క్రీడాకారులు ప్రతి ఒక్కరూ దేహదారుఢ్యం కలిగి ఉండాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. గురువారం హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంగా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 3కే ర్యాలీ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులకు నిత్య వ్యాయామంతోనే దేహదారుఢ్యం సాధ్యమవుతుందన్నారు. జిల్లా నుంచి ఒలింపిక్ స్థాయికి ఎదిగేలా క్రీడాకారులు, అధికారులు కృషి చేయాలన్నారు. ముందుగా భానుగుడి సెంటర్ నుంచి డీఎస్‌ఏ మైదానం వరకు భారీగా క్రీడాకారులు పాల్గొన్న ఈ ర్యాలీ సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డీఎస్‌ఏ మైదానంలో ఉన్న మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి ఎంపీతోపాటు అధికారులు, క్రీడాకారులు నివాళులర్పించారు. ఆడిటోరియంలో రైఫిల్ షూటింగ్ కోసం రూ.3.14 లక్షలతో ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ క్రీడాపరికరాలను ఎంపీతోపాటు జేసీ రాహుల్‌మీనా ప్రారంభించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న వెటరన్ క్రీడాకారులతోపాటు పలువురు శిక్షకులను సత్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రు గోవిందరాజు, ఎల్.జార్జి, కె.నూకరాజు, వి.రవిరాజు, వి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.





కాకినాడలో గురువారం నిర్వహించిన పోలీసుల బైక్ ర్యాలీ దృశ్యం.. హెల్మెట్ ధరించిన వాహనదారులకు చిరు కానుకలు అందజేసిన పోలీసు అధికారులు

హెల్మెట్ ధరించాలని పోలీసుల బైక్ ర్యాలీ

కాకినాడ క్రైం, ఆగస్టు 29: రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడలో గురువారం సాయంత్రం పోలీసులు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కాకినాడ ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభించి సర్పవరం మీదుగా భానుగుడి జంక్షన్, బాలాజీ చెరువు వరకు పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ప్రధాన సెంటర్లలో హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న కొంతమంది వాహనదారులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ ర్యాలీలో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ట్రాఫిక్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

‘నీటి సంఘాల ఎన్నికలకు చర్యలు చేపట్టాలి’

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 29: జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నిర్ణయించిన నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా, సుబ్బారెడ్డిసాగర్ ఆయకట్టు కింద ఇప్పటికే నీటి సంఘాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గం వారీగా అడంగల్ అనుసరించి రైతులు వివరాలు సిద్ధం చేయాలన్నారు. అలాగే తూర్పు ఆయకట్టు కింద నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసమైన ప్రాదేశిక నియోజకవర్గం పరిధి నిర్ణయించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో తిప్పేనాయక్, ఆర్డీవోలు ఇట్ల కిషోర్, సీతారామరావు, ఇరిగేషన్ డీఈలు రవి, పోచారావు, పుష్కర కెనాల్ ఈఈ రాజేశ్వరరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. హవా వారిదేనా?

జిల్లాలో క్రషర్ యజమానుల ఆవేదన

రౌతులపూడి, ఆగస్టు 29: కాకినాడ జిల్లాలో మైనింగ్ చెక్‌పోస్టు నిర్వహణపై బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రషర్ యాజమానులు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సమావేశం రౌతులపూడి మండలం మల్లంపేట గ్రామంలోని మండల క్రషర్ యూనియన్ అధ్యక్షుడి క్రషర్ వద్ద జరగగా రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, జగ్గంపేట తదితర గ్రామాల క్రషర్ యాజమానులు పాల్గొని ముఖ్యంగా మైనింగ్ చెక్‌పోస్టు విషయంపై చర్చించుకున్నట్టు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌కు భయపడి చెక్‌పోస్టుల దందాపై మాట్లాడలేకపోయామని, ప్రభుత్వం మారిన వెంటనే చెక్‌పోస్టులు తొలగించారని.. ఇప్పుడు మళ్లీ చెక్‌పోస్టులు పెట్టి అది కూడా వైసీపీకి చెందిన వారికే కేటాయించారని క్రషర్ యజమానులు ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. అలాగే అనుమతి ఉన్నవారికి కాకుండా మైనింగ్ అధికారులు ఎవరికి పడితే వారికి గతంలో బిల్లు ఇస్తే వైసీపీ వాళ్లు బ్లాక్‌లో అమ్ముకున్నారని, మళ్లీ అదే పరిస్థితి పునరావృత్తం అవుతుందని ఆరోపించారు. ఇలాగైతే వ్యాపారం చేయలేమని ఆవేదన చెందారు. క్రషర్లు మూసివేద్దామని ఈ సందర్భంగా చర్చ జరగగా, కొందరు ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళదామని, పవన్ ఇంటి వద్ద వినతిపత్రం ఇద్దామని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో 100 మంది పాల్గొన్నట్టు సమాచారం.

సంజయ్ కలాసీ సేఫ్!

నేడు పోలీసుల ముందుకు కిడ్నాపర్లు

మధ్యవర్తి ద్వారా పోలీసులతో మంతనాలు

స్వచ్ఛందంగా లొంగుబాటుకు అంగీకారం - 7లో

పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు - 7లో

ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలి

క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేయస్ భరత్) - 7లో





వివాదాస్పద అభయ్ రెస్టారెంట్, సర్వే చేస్తున్న దృశ్యం

అభయ్ రెస్టారెంట్ వివాదం.. రెండు శాఖల మధ్య దుమారం!

అన్నవరం, ఆగస్టు29: అన్నవరంలో పంపా రిజర్వాయర్‌ని ఆనుకుని ఉన్న అభయ్ రెస్టారెంట్ స్థల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ స్థలం తమదంటే తమదని ఇరిగేషన్, దేవస్థానం అధికారుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తుండగా, మండల సర్వేయర్ విచ్చేసి గురువారం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆధ్వర్యంలో దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో మార్కింగ్‌లు వేశారు. అభయ్ రెస్టారెంట్ నిర్మాణం దేవస్థానం స్థలంలో జరిగిందని, గతంలో రెస్టారెంట్ ఆనుకుని ఉన్న సత్యమేవజయతే అనే ఆర్చి ఇప్పటికీ కనిపిస్తోందని దేవస్థానం అధికారులు పేర్కొంటూ కొన్ని ఆధారాలు చూపించారు. మరోవైపు 1964లో బండిమార్గం మాత్రమే ఉండేదని అప్పటికి రిజర్వాయర్ హద్దులు కూడా లేవని ఇరిగేషన్ అధికారులు తమ వాదన వినిపించారు. ఇరువాదనలు విన్న తర్వాత సర్వే అధికారులు సర్వే చేసి బౌండరీలైన్ మార్కింగ్ వేయడంతో దేవస్థానానికి చెందినదిగా నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. అయితే ఈ సర్వే దేవస్థానానికి అనుకూలంగా చేశారంటూ ఇరిగేషన్ అధికారులు సంతకాలు పెట్టకపోవడంతో సమస్య సమసిపోలేదనే వాదన వినిపిస్తోంది. దీనికి సంబంధించిన నివేదికను వచ్చే నెల రెండు, మూడు తేదీల్లో అందజేయనున్నట్టు సర్వే అధికారులు తెలిపారు. సర్వే సమయంలో దేవస్థానం తరపున ఏఈవోలు కొండలరావు, ఎల్ శ్రీనివాస్, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, కాపారపు శివ, అనకాపల్లి ప్రసాద్ పాల్గొనగా ఇరిగేషన్ నుంచి ఈఈ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

వరలక్ష్మీవ్రత టోకెన్ల కోసం పాదగయ క్షేత్రంలో బారులు

12 వేల చీరల పంపిణీకి పవన్‌కల్యాణ్ ఏర్పాట్లు

గందరగోళంగా మారిన టోకెన్ల జారీ - 7లో



రుద్రాక్షలతో

వినాయకుడు, శివలింగం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన కోలా వీరబాబు ఐదు వేల రుద్రాక్షలతో నాలుగు అడుగుల వినాయక విగ్రహాన్ని, మూడు అడుగుల శివలింగాన్ని తయారు చేశాడు. వినాయకచవితికి వీటిని ప్రత్యేకంగా ప్రతిష్ఠిస్తానని ఆయన చెప్పాడు.

\- గొల్లప్రోలు

మాతృ భాషపై మమకారం

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్



రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఒక న్యాయాధికారి మాతృ భాషపై మమకారం చాటుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సెల్ ఫోన్ చోరీ కేసులో 2022లో ఇద్దరిపై కేసు నమోదైంది. రెండేళ్లగా కొనసాగుతున్న ఈ కేసు గురువారం మొదటి శ్రేణి రెండో అదనపు న్యాయాధికారి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ బెంచిపైకి వచ్చింది. ఆయన విచారించి నేరం రుజువు కాకపోవడంతో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తెలుగులో తీర్పు వెలువరించారు. అంతే కాకుండా తీర్పు కాపీని కూడా తెలుగులోనే ఇచ్చారు. అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మన భాషను మించిన భాష లేదన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి తన వంతు కృషిలో భాగంగా 2018 నుంచి తెలుగు భాషా దినోత్సవం రోజున ఏదో ఒక కేసులో తీర్పును తెలుగులో చెప్పడం అలవాటు చేసుకున్నానన్నారు. కక్షిదారులకు అర్థమయ్యేలా వారి మాతృ భాషలో తీర్పులను తర్జుమా చేసి ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు సైతం చెప్తున్నాయని గుర్తు చేశారు. తెలుగు భాష చాలా గొప్పదని, మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. కృష్ణప్రసాద్‌ను పలువురు అభినందించారు.



తెలుగు భాష తియ్యదనం

అమ్మలాంటి అనురాగం... అమృతంలాంటి కమ్మదనం కల తెలుగు మన మాతృ భాష కావడం అదృష్టమని ఓక్‌వుడ్ స్కూలు ఛైర్మన్ కె.రాంబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు బీజాపురి టౌన్‌షిప్‌లో గల ఈ స్కూలు విద్యార్థులు గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు.

\- దివాన్‌చెరువు

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తెస్తాం



ఉమ్మడి జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు లక్ష్యం

అల్లూరి జిల్లాలో కొత్తగా 400 సెల్ టవర్ల ఏర్పాటు

3జీ సిమ్‌లను తీసుకొచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందండి

బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు

అమలాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కుపూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఉమ్మడి జిల్లా ఐటీఎస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో 2లక్షల బీఎస్ఎన్ఎల్ ఫోన్ కనెక్షన్లు ఉండేవని, నేడు అవి 10వేలకు పడిపోయాయన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకుని శరవేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని, త్వరలోనే ఆ లక్ష్యాన్ని సాధిస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాలకు సైతం బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరిస్తామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద డీఈ పీఎస్ఎల్ నరసింహారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం రాజు మాట్లాడుతూ లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగీ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ మండలాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించనున్నామన్నారు. తక్కువ ఖర్చుతో మంచి సేవలందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వరంగ సంస్థ కావడం వల్ల ప్రజలకు అందుబాటులోనే టారిఫ్‌లు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ప్రముఖ సంస్థల నుంచి ఖాతాదారులు బీఎస్ఎన్ఎల్‌లోకి మారుతున్నారని, త్వరలో మరింత వేగం పెరుగుతుందన్నారు. తొలుత సంస్థ కార్యాలయం వద్ద బీఎస్ఎన్ఎల్ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిబ్బందితో కలిసి పట్టణ వీధుల్లో చేపట్టిన మోటారు సైకిళ్ల ర్యాలీలో జీఎం పాల్గొని పలుచోట్ల మాట్లాడారు. రాజమహేంద్రవరం డీజీఎం వి.రాజశేఖర్‌బాబు, కాకినాడ డీజీఎం డి.సైదానాయక్, రాజమహేంద్రవరం డీజీఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం ఏజీఎం మార్కెటింగ్ అండ్ ఈబీ బొమ్మిడి శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏజీఎం వి.శారదాదేవి, ఏజీఎంలు టి.జయశ్రీ, వైశైలజ, మంగళంపల్లి అంజిబాబు, పెనుమాల చిట్టిబాబు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా తీసుకుంటున్న చర్యలను జనరల్ మేనేజర్ రాజు ఇలా వివరించారు.



ప్రచారంలో నినాదాలు చేస్తున్న జనరల్ మేనేజర్ రాజు, ఉద్యోగులు

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 400 బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు ఉన్నాయి.
- సీఎండీ ఆదేశాలతో కొత్తగా 50 సెల్ టవర్లు మంజూరు కాగా కోనసీమ జిల్లాకు ప్రత్యేకంగా 20 కేటాయించారు.
- ప్రధానమంత్రి అంత్యోదయ పథకంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని 11 ఏజెన్సీ మండలాల్లో కొత్తగా 400 సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం.
- ఇప్పటి వరకు ఏజెన్సీ మండలాల్లో జియో, ఎయిర్‌టెల్ వంటి సర్వీసులు కూడా అందని ప్రాంతాల్లో ఈ సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం. అక్టోబరు నెలాఖరు నాటికి 90 శాతం సెల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యం.
- బీఎస్ఎన్ఎల్‌లో ఇప్పటికే 2జీ, 3జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా 4జీని తీసుకువచ్చాం. 3జీ సిమ్‌లను తీసుకువచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందొచ్చు. 4జీ సిమ్‌లతో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తాము.
- త్వరలోనే 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.
- ఉమ్మడి జిల్లాలో 5.50లక్షల మొబైల్ ఫోన్లు బీఎస్ఎన్ఎల్‌లో ఉన్నాయి. ఈ నెల 30వేలు కనెక్షన్లు అదనంగా పొందాల్సి ఉండగా ఇప్పటికే 26వేల కనెక్షన్లు సాధించాము. గత నెలలో 24వేల కనెక్షన్లు పొందాము..

నేడు రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 29: అన్నవరం దేవస్థానంలో శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఆసక్తి గల మహిళలు కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలను దేవస్థానం అందజేస్తుందని చెప్పారు.

6న జడ్పీ సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 29: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలను సెప్టెంబరు 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: పీఎంకేవీవై 4.0 పథకంలో భాగంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇన్‌స్టలేషన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండిషనర్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల వయసు 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ జెరాక్స్, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, ఇంటర్ పాస్ సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో సెప్టెంబరు 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790798431 నెంబరును సంప్రదించాలని చెప్పారు.



సత్యదేవుని సన్నిధిలో అనంతపురం ఎంపీ

అన్నవరం, ఆగస్టు 29: రత్నగిరిపై వేంచేసియున్న సత్యదేవుని అనంతపురం ఎంపీ బీకే పార్థసారధి గురువారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈవో సస్పెన్షన్

ద్రాక్షారామ, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం ఈవో పీటీవీ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆలయానికి రథం తయారీతో పాటు పలు ఆరోపణలపై మంత్రి సుభాష్ ఈవోపై విచారణ జరిపించారు. ఇటీవల దేవదాయ శాఖ ఆర్జేసీ కె.సుబ్బారావుతో పాటు అధికారులు రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి కమిషనరుకు నివేదిక అందజేశారు. రథం తయారీకి దాతల నుంచి చందాలు వసూలు చేయడంలో నిబంధనలు పాటించకపోవడం, కమిషనరు అనుమతి తీసుకోకపోవడం కారణంగా చూపించి ఈవోను సస్పెండ్ చేశారు.



సంజయ్ కలాసీ సేఫ్!

నేడు పోలీసుల ముందుకు కిడ్నాపర్లు!

మధ్యవర్తి ద్వారా పోలీసులతో మంతనాలు

స్వచ్ఛందంగా లొంగుబాటుకు అంగీకారం





అపహరణకు గురైన సంజయ్ కలాసీ (ఎడమ), నిందితులు మున్నా, స్వామినాయుడు (కుడి)

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీని అపహరించిన ఘటనలో నిందితులు మధ్యవర్తి ద్వారా పోలీసులతో మాట్లాడారని తెలుస్తోంది. సంజయ్ కలాసీ అమలాపురం, తుని పరిసర ప్రాంతాల్లో చేపల రైతుల వద్ద నుంచి సరుకు కొనుగోలు చేసి ఒడిశా తీసుకెళ్తాడు. ఓ ఐదారు నెలలు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాడు. దీంతో స్వామినాయుడు అనే మధ్యవర్తి కమీషన్ కోసం పలువురు రైతుల వద్ద నుంచి సంజయ్‌కు సరుకు ఇప్పించాడు. ఈ క్రమంలో సుమారు రూ.3 కోట్లు బకాయిపడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్లలో అతడిపై ఏడు కేసులు ఉన్నాయి. కలాసీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.. వారు అరెస్టు చేయడం.. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఒడిశా వెళ్లిపోవడం జరుగుతోంది. ఇలా మూడేళ్ల నుంచీ వేధిస్తున్నాడు. అందరూ తెలిసినవాళ్లు కావడంతో రోజూ తమ బాకీల కోసం అడుగుతుండడంతో స్వామినాయుడు వారి కంటపడకుండా ఊరు విడిచి తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విసుగు చెందిన స్వామినాయుడు జైలు నుంచి విడుదలయ్యే సమాచారం తెలుసుకుని అపహరించాడు. దీనిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. అమలాపురం, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు ప్రాథమికంగా తెలుసుకున్నారు. ఈలోపు గురువారం ఒక మధ్యవర్తి పోలీసులతో మాట్లాడి నిందితులు వచ్చి లొంగిపోతారని, బకాయిలు వసూలు కోసమే వారు అలా చేశారని చెప్పారు. పోలీసులు సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం ఉదయం పోలీసుల ముందుకు నిందితులు వచ్చే అవకాశం ఉంది. బాధితుల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామానికి చెందిన వాళ్లే ఎక్కువ మంది ఉన్నారని చెప్తున్నారు. దీంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన విధానం కాదని మందలించడం, నిందితులు నేరస్వభావం కలిగిన వారు కాకపోవడం వల్ల పోలీసుల ముందుకు రావడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. అపహరణకు గురైన సంజయ్ కలాసీకి ఎలాంటి హానీ తలపెట్టలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. సంజయ్.. అతడిని అపహరించిన నిందితులంటూ స్వామినాయుడు, మున్నా ఫొటోలను ఎస్పీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. ఆచూకీ తెలిసిన వారు 9440796574, 9490760792 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు కోరారు.



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీ నరసింహారావు

పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరిగిందని కాకినాడ కమిషనర్ భావన అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలో ఉన్న 319 వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ హాలులో జరిగింది. ఆర్డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్టీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ భావనతో పాటు అడిషనల్ కమిషనర్, రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు పర్యవేక్షించారు. ఉద్యోగుల కోరిక మేరకు కొన్ని బదిలీలు జరిగాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, వితంతువులు, భార్యభర్తలు పరస్పర అవగాహనతో పలువురికి బదిలీలు చేపట్టారు. వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు 20 మంది, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 41 మంది, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు 16 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 18 మంది, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు 23 మంది, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు 40 మంది... మొత్తం 158 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 139 మంది హాజరయ్యారు. వీరందరికీ బదిలీల కౌన్సెలింగ్ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు ఉత్తర్వులు అందజేస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు.

కోలుకుంటున్న బాలికలు

ఏలేశ్వరం, ఆగస్టు 29: ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారిలో బుధవారం రాత్రి వరకు 32 మందికి వైద్య సేవలు అందించారు. గురువారం ఉదయం మరో ఇద్దరు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. మొత్తం 34 మందికి వైద్య సేవలు అందించగా వారిలో ఒకరిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రానికి కోలుకున్న ఎనిమిది మందిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం 24 మందికి వైద్య సేవలు అందిస్తున్నామని, విద్యార్థినులు కోలుకుంటున్నారని డాక్టర్ శైలజ చెప్పారు.





పిఠాపురం పాదగయ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రత టోకెన్ల కోసం క్యూలైన్లలో కూర్చున్న మహిళలు

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

» పిఠాపురం పాదగయలో విస్తృత ఏర్పాట్లు » 12వేల చీరలు పంపించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ » టోకెన్ల కోసం మహిళల క్యూ

పిఠాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు దేవదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు సరస్వతీదేవి మందిరం, చండీహోమం జరిగే ప్రాంతంలోనూ వ్రతాలు నిర్వహించనున్నారు. మూడు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌లో రెండువేల మంది మహిళలు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. వారికి పూజా సామగ్రిని సమకూర్చనున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు చీరలు, పసుపు, కుంకుమను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమకూర్చారు. 12వేల చీరలు పంపించినట్టు జనసేన వర్గాలు తెలిపాయి. పాదగయలో ఆరువేల మంది మాత్రమే వ్రతాలు ఆచరించే అవకాశం ఉంది. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చి చీరలు అందిస్తారని చెప్తున్నారు.

వరలక్ష్మీ వ్రతాల కోసం మహిళలకు టోకెన్ల జారీ గందరగోళంగా మారింది. సాధారణంగా పాదగయ అధికారులు టోకెన్లు ఇచ్చే సమయాన్ని ముందుగా ప్రకటిస్తారు. ఈసారి దానిని రహస్యంగా ఉంచడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఉదయం 9 గంటలకే వచ్చి క్యూలైన్లలో నిలుచున్నారు. వర్షానికి తడుస్తూ, ఉక్కపోతతో సతమతమవుతూ ఐదు గంటలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. పాదగయ అధికారులు మధ్యాహ్నం 2.15 గంటలకు టోకెన్ల జారీ ప్రారంభించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. 2వేల మందికి టోకెన్లు పంపిణీ చేసినట్టు పాదగయ అధికారులు తెలిపారు. పలువురు మహిళలు తమకు టోకెన్లు అందలేదని ఈవో కార్యాలయం వద్ద సిబ్బందిని ప్రశ్నించడం కనిపించింది.

పాదగయలో వరలక్ష్మి వ్రతం ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించినట్టు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వ్రతాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలి

క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్)

పెద్దాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలోని ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తాను భారతదేశం తరఫున 69 మ్యాచ్‌లు ఆడానని, ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నానన్నారు. చేసే ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలన్నారు. క్రమశిక్షణతో సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏదీ లేదన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలు చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యమివ్వడం గర్వకారణమన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాజేష్ కామిశెట్టి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విషయంలోనూ పోటీ పడాలని, అప్పుడే రాణించగలుగుతామన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. క్రికెటర్ భరత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ రామకృష్ణ, కో-ఆర్డినేటర్ ప్రశాంతి, ఉషా చైతన్య పాల్గొన్నారు.



శ్రీప్రకాష్ పాఠశాల ఆవరణలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్రికెటర్ శ్రీకర్ భరత్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: కాకినాడ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు డిపో మేనేజర్‌కి 9959225534 నెంబర్‌కు తెలపాలన్నారు.

మహారాజా దానం చేసిన భూములను పరిరక్షిస్తాం

ఎమ్మెల్సీ హరిప్రసాద్

పిఠాపురం, ఆగస్టు 29: పిఠాపురం మహారాజా దానం చేసిన భూములను పరిరక్షిస్తామని, పేద విద్యార్థులకు నిరంతరాయంగా ఉచిత భోజన వసతి కల్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సంస్థానసత్రంలో విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయాన్ని ఆయన గురువారం ప్రారంభించి భోజనాలు వడ్డించారు. మహారాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం మహారాజా కుమారుడు రాజా రావు రామరత్నారావు, ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని జిల్లా కోర్టు నుంచి బైపాస్‌రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు.

'నిబంధనలు పాటించని అనాధాశ్రమాలపై చర్యలు'

కరప, ఆగస్టు 29: నిబంధనలు పాటించని అనాధాశ్రమాలపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి హెచ్చరించారు. మండలంలోని గొడ్డటిపాలెంలోని జీవనజ్యోతి అనాధాశ్రమాన్ని గురువారం ఆమె సందర్శించి మాట్లాడుతూ ఈ అనాధాశ్రమానికి ఏ అనుమతులు లేవని, ఓల్డ్ ఏజ్ హోమ్ పేరుతో చిన్న పిల్లలను చేర్చుకుంటున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ ఉంటున్నవారిని మెరుగైన వసతులు ఉన్న కరప షారోన్ అనాధాశ్రమంలో నలుగురిని, కాకినాడ జగన్నాయక్‌పూర్ బీసీ హాస్టల్‌లోలో మరో నలుగురిని చేర్పించామన్నారు. తమ పిల్లలను తామే చూసుకుంటామని తల్లిదండ్రులు రాగా ఐదుగురిని వారికి అప్పగించామని తెలిపారు. ఐసీపీఎస్ ఓఆర్‌డబ్ల్యూ చిన్నబాబు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, వీఆర్వో భరణికుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సీఐగా సూర్య అప్పారావు బాధ్యతలు



ప్రత్తిపాడు, ఆగస్టు 29: ప్రత్తిపాడు సీఐగా గురువారం పి.సూర్య అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన ఎం.శేఖర్‌బాబు బదిలీలో భాగంగా రిలీవ్ కావడంతో అప్పారావు బాధ్యతలు స్వీకరించి ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడేందుకు సాయిశక్తులా కృషి చేస్తామన్నారు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది సీఐని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

'పొలంబడి' కార్యక్రమాలు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 29: మండలంలోని గొల్లలగుంట గ్రామంలో అగ్రికల్చర్ ఏవో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి రైతులు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా లింగాకర్షక బుట్టలు, పక్షిస్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతం తయారు చేయడాన్ని చూపించారు. రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో సద్గురుమూర్తి పురుగుమందులు విషతుల్యంపై అవగాహన కల్పించారు. నాయకులు కంటిపూడి రామారావు, వీఏఏ అంజలి, వీహెచ్ఏ ఉదయ్, రైతులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తులు

పెద్దాపురం, ఆగస్టు 29: మండలంలోని దివిలి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు హోమియో వైద్యాధికారిణి డాక్టర్ మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమా చేసి అనుభవం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. నెలకు పురుష శిక్షకులు 32 గంటలు, స్త్రీ యోగా శిక్షకులు 20 గంటలు చొప్పున పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైనవారికి గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9440147206 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

1న ప్రజాప్రతినిధులకు సన్మానం

తాళ్లరేవు, ఆగస్టు 29: తాళ్లరేవు మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో టీడీపీ ప్రజాప్రతినిధులు మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులకు నిర్వహించే సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శెట్టిబలిజ సంఘం నేత కట్టా త్రిమూర్తులు, టేకుమూడి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గురువారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో శెట్టిబలిజ సోదరులు సమావేశమై చర్చించారు. సెప్టెంబరు 1న తాళ్లరేవు సూర్యభాస్కర కళ్యాణమండపంలో సన్మాన కార్యక్రమాన్ని కూటమి నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నేతలు గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, కుడిపూడి దుర్గాప్రసాద్, టేకుమూడి సత్యనారాయణ, అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్ తదితరులున్నారు.

1 నుంచి స్వచ్ఛత పఖ్వాడా : సీఎంవో

ప్రత్తిపాడు, ఆగస్టు 29: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సెప్టెంబరు 1 నుంచి 15 వరకు నిర్వహించే స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వరరావు కోరారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు,విద్యార్థులతో సెప్టెంబరు మొదటి పక్షం రోజులు స్వచ్ఛత ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రత్తిపాడు, గొల్లప్రోలు ఎంఈవో వి.రాజబాబు, శివప్రసాద్, సీఆర్పీలు రాంజీప్రసాద్, భాషా మల్లేష్, గంగారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

శంఖవరం, ఆగస్టు 29: కత్తిపూడి-శంఖవరం రోడ్డులో లారీ ఢీకొని మచ్చా ఈశ్వర్ (16) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కత్తిపూడి గ్రామానికి చెందిన మచ్చా గంగరాజు కుమారుడు ఈశ్వర్ స్నేహితుడిని మోటారు సైకిల్‌పై దించేసి వస్తుండగా కత్తిపూడి నుండి శంఖవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేశారు.

పాన్ షాప్‌లో వరుస చోరీలు

కొత్తపల్లి, ఆగస్టు 29: కొత్తపల్లి ఊరచెరువు గట్టుపై ఉన్న ఉంగరాల గణేష్ పాన్ షాప్‌లో బుధవారం అర్ధరాత్రి సుమారు రూ.50 వేల విలువైన సరుకులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకునిపోయారు. గత రెండు నెలల్లో ఇదే పాన్‌షాప్‌లో ఇప్పటికి నాలుగుసార్లు చోరీలు జరగడం గమనార్హం. పాన్‌షాప్‌లో సిగరెట్ ప్యాకెట్లు, చాక్లెట్‌చ డ్రింక్ బాక్స్‌లు, నగదును దోచుకునిపోయినట్టు గణేష్ గుర్తించాడు. పాన్ షాప్‌లో నాలుగు సార్లు చొరబడిన దొంగలు స్థానికులే అని గణేష్ అనుమానాన్ని చేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హంసవరంలో చోరీ

తునిరూరల్, ఆగస్టు 29: హంసవరంలో చోరి జరిగింది. గ్రామానికి చెందిన రైతు వాసంశెట్టి అప్పారావు కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉన్న ఇంట్లోకి దుండుగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. అప్పారావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణమాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. 70 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండి, రూ.2లక్షల నగదు చోరీకి గురైనట్టు అప్పారావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


త్రుటిలో తప్పిన ప్రమాదం

తునిరూరల్, ఆగస్టు 28: తుని పట్టణశివారు రైల్వే గేటు సమీపంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. 30 మంది మహిళా కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు. గురువారం జీడిపిక్కల పరిశ్రమకు 30 మంది పనులు ముగించుకుని బస్సులో ఇంటికెళ్తుండగా డ్రైవర్‌కి బీపీ డౌన్‌అయి తల తిరగడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఓ దుకాణంలోకి దూసుకెళ్లినట్టు తెలిసింది. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవ్వరికి ఎటువంటి గాయాలవ్వలేదని చెప్పారు.

నేడు బొక్కుసార చేప పరిరక్షణపై అవగాహన

కాకినాడ సిటీ, ఆగస్టు 29: ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న బొక్కుసార చేప పరిరక్షణపై శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కాకినాడ కుంభాభిషేకం రేవులో బోటు యజమానులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ తెలిపారు. సదస్సులో పోర్టు, ఫిషరీస్, ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఎస్ఐ ఎఫ్టి, మెరైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు,బోటు ఓనర్ల సంఘ నాయకులు పాల్గొననున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బొక్కు సార చేప దినోత్సవ వేడుకల్లో భాగంగా మత్స్యకార వాడల్లో అవగాహన సదస్సులు జరుగుతున్నాయి.

బాలాత్రిపురసుందరికి బంగారు గాజులు బహూకరణ



దాతకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

పోర్టు సిటీ (కాకినాడ), ఆగస్టు 29: నగరంలో శ్రీ బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి దేశిరాజు శ్రీనివాస్-కృష్ణ కిరణ్మయి దంపతులు జత బంగారు గాజులను బహూకరించారు. గురువారం దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ భాస్కరరెడ్డిలకు అందజేశారు. అనంతరం దంపతులకు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

» గిడుగు చిత్రపటాలకు నివాళి

» ఉపాధ్యాయులకు సత్కారాలు





తొండంగి: బెండపూడిలో గిడుగు చిత్రపటానికి నివాళి, పిఠాపురంలో ఆకట్టుకున్న విద్యార్థులు

పిఠాపురం, ఆగస్టు 29: పిఠాపురంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం తెలుగు ఉపాధ్యాయులు రావు కవిత, కొల్లు హేమలతలను శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ జనార్ధనాచార్యులు పాల్గొన్నారు. పట్టణంలోని భాష్యం స్కూలులో గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పత్రికా పఠనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు పాల్గొన్నారు

పెద్దాపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కార్యాలయం ఆవరణలో తెలుగుతల్లి విగ్రహానికి, తెలుగు భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ఏవో కేవీ మాధవరావు పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. తెలుగు భాషను బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అమ్మభాషపై పట్టు సాధించడంతో పాటు మమకారం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తొండంగి: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. బెండపూడి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. రావికంపాడులో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు.

తునిరూరల్: తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో వేడుకలకు ఆధ్యాత్మిక వేత్త, పండితులు అమ్ము వెంకట జోగయ్య శాస్త్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికితీయాలని మాతృభాష పట్ల మమకారం కలిగి ఉండాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తేటగుంట ప్రభుత్వ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత, గాయకుడు కేవీ రమణను తునిలో ఘనంగా సత్కరించారు. అక్షర పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కరప: మండలంలోని పెద్దాపురప్పాడు, గురజనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వ్యాసరచన, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూళ్ల హెచ్‌ఎంలు ఎస్.శ్రీనివాస్, ఎ.సాయిమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు బీవీఎన్ ప్రసాద్, కె.నాగలింగేశ్వరరావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు వెంకట్రావు, రమణమూర్తి పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలో ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల వివిధ ఆదిత్య యూనివర్సిటీ, ఇంజనీరింగ్ ఫార్మసీ, పాలిటెక్నిక్, బిజినెస్ స్కూల్, ఫోరెనిక్స్ కళాశాలలో గల గ్రంథాలయ విభాగం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు చేసిన సేవలను కొనియాడారు.

సామర్లకోట: అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు వి.రాజు, తెలుగు ఉపాధ్యాయురాలు జీ.బేబీ రాణీ, ఉపాధ్యాయులు కె.అరుణ, కె.సత్యనారాయణ, కే.శ్రీనివాస్, ఏ.శ్రీవల్లీ, పీ.లక్ష్మి, మహ్మద్ నూర్జహాన్ బేగం, ఎస్ఎల్.భార్గవి, సీహెచ్.భద్రమ్మ, పి.బ్రహ్మానందం, జి.శంకర్ పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. సారేజహాసే అచ్చా హిందీ గీతాన్ని తెలుగుభాషలో అనువదించి విద్యార్థులు నాగచైతన్య, చాందిని పాడి అలరించారు.

అమృతోక్తులు పుస్తకావిష్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రేచర్లపేట కాకినాడ నగరపాలక సంస్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మట్టపర్తి గంగారామ్, తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు దాడి చంద్రశేఖర్‌రావు సంకలనం చేసిన అమృతోక్తులు- నీతి పద్యమాలిక పుస్తకాన్ని గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌లతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని రూపొందించిన ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లాలో టూరిజం అభివృద్ధికి చొరవ తీసుకోవాలి

మాజీ మంత్రి యనమల



అధికారులతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, ఆగస్టు 29: జిల్లాలో టూరిజం స్పాట్‌లను గుర్తించి వాటి అభివృద్ధికి చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో జిల్లా టూరిజం, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికా అభివృద్ధి శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఆదాయంలో టూరిజం నుంచి భాగస్వామ్యం ఉండాలని ముఖ్యంగా అన్నవరం దేవస్థానం, లోవ దేవస్థానం, కోన ఫారెస్ట్‌ను ఆనుకుని దానవాయిపేట, పెరుమళ్ళపురం ప్రాంతాల అభివృద్ధిపై అధికారులతో మాట్లాడారు. తుని, పాయకరావుపేట నడుమ తాండవ నదీ తీరాన్నిటూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేసేందుకు పరిశీలించాలని సూచించారు. జిల్లా సీపీవో త్రినాధ్‌తో జిల్లా ఆదాయంపై సమీక్షించారు. రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే జిల్లాలో కాకినాడ జిల్లా 10వ స్థానంలో ఉందని, జిల్లాను 1,2 స్థానాల్లో నిలిపేందుకు ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ స్వామి నాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి దండెం హరిశేష, ఏపీవోలు బి.త్రిమూర్తులు, ఎ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వేదసభ



భీమేశ్వరాలయంలో వేదసభలో పండితులు

సామర్లకోట, ఆగస్టు 29: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో గురువారం శ్రీబాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో 26వ వేదసభ ఘనంగా నిర్వహించారు. వేదశాస్త్ర పరిషత్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వేదాలలో నిష్ణాతులు, పండితులు పెద్దఎత్తున హాజరై తమ నైపుణ్యాన్ని అనర్గళంగా వల్లించారు. అనంతరం వేదశాస్త్ర పరిషత్ చైర్మన్ డాక్టర్ పద్మనాభం చేతుల మీదుగా పండిత సత్కారం చేశారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, కంటే బాబు, అంజన్‌కుమార్ ఆలయ పండితులు సోమేశ్వరశర్మ,చెరుకూరి రాంబాబు ఉన్నారు.

దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ బదిలీ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 29: కాకినాడ దేవదాయ, ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎమ్.విజయరాజును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఆ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రాజమహేంద్రవరం, కాకినాడలకు డిప్యూటీ కమిషనర్‌గా ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించింది. విజయరాజును తక్షణం కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా మనోహర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.మనోహర్ బాధ్యతలు చేపట్టనున్నారు. అమలాపురం గ్రేడ్2 మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన కాకినాడ డీసీగా బదిలీపై రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శేఖర్ తదుపరి పోస్టింగ్ కోసం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దాలి

» డీఈవో పిల్లి రమేష్ » ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



క్రీడా ప్రతిభా అవార్డులు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలతో డీఈవో

కాకినాడ రూరల్, ఆగస్టు 29: ప్రతీ పాఠశాల నుంచి ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దాలని కాకినాడ డీఈవో పిల్లి రమేష్ సూచించారు. కాకినాడ విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఈవో, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్ చేతులమీదుగా జిల్లాలో ఉన్న 5 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా ప్రతిభా అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మార్ని శ్రీనివాసరావు, ఎం.సూర్యనారాయణమూర్తి పీఈటీలు జార్జి, నూకరాజు, పట్టాభి, చంద్రశేఖర్, రవిరాజు, నాగు, శ్రీనివాస్, త్రిపుల,మేరీ పాల్గొన్నారు.

జేఎన్టీయూకే: ప్రతీ ఒక్కరూ ఏదొక క్రీడలో రాణించాలని, క్రీడలు మానసిక, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అన్నారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ 119వ జన్మదినోత్సవ వేడుకలను జేఎన్టీయూకే ఇండోర్ మైదానంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు పూలమాలవేసి నివాళులర్పించారు. కుస్తీ పోటీల్లో భాగంగా ఇప్పటి వరకూ 8జాతీయ స్థాయిపోటీల్లో 10 బంగారుపతకాలు, ఖేలో ఇండియా, గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో పాల్గొన్న కళాశాల క్రీడాకారిణి బి.కావ్యను అతిథులు సత్కరించి మెమోంటోను అందజేసారు. ఎన్ఎస్ఎస్ అధికారులు, పీడీలు, క్రీడాకారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులున్నారు.

సామర్లకోట: జీ.మేడపాడు పీఎస్సార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పాండవులు, వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగారాజుల ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో విజేతలకు గ్రామ ప్రతినిధులు పాలకుర్తి వీరభద్రనారాయణ, భాస్కరరావు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, కారమ్స్ పోటీలు, మహిళలకు 1కె రన్, పురుషులకు 3కె రన్ నిర్వహించారు.

కరప: జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును కరప హైస్కూల్ పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, కె.కృష్ణలకు డీఈవో అందజేసి మాట్లాడారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లో పీడీలను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాల నుంచి వివిధ క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా అభినందించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, వైస్‌చైర్మన్ ఎస్.పుష్పశాంతికుమారి, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు ప్రసాద్‌కుమార్, సత్యనారాయణ, రాధాకృష్ణ, టి.శ్రీనివాస్, సుదర్శన్ బాబు, ఆలీ, మూర్తి, సుధాకర్‌లు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ



శంఖవరం: కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, ఆగస్టు 29: బాలికల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని, వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శంఖవరంలో కోటి 3 లక్షలు సమగ్రశిక్ష నిధులతో నూతనంగా నిర్మించిన కేజీబీవి కళాశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాటాడుతూ విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తనని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్దిరామారావు, సీనియర్ నేత పర్వత సురేష్, తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకటసుబాష్, ఉల్లి వీరబద్రర రావు, ఒలేటి లక్ష్మినారాయణ, తోట అప్పారావు, పాకల ప్రసాద్, తహశీల్దార్ పోతురాజు, ఎంపీడీవో శివరామకృష్ణ, ఎంఈవో ఎస్వీరమణ, జిసిడివో పి.మహేశ్వరి, ప్రిన్సిపాల్ బాలామణికుమారి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

పర్యవేక్షణ చేయాలి

ఏలేశ్వరం: మండస్థాయి అధికారులు తమ పరిధిలోని సిబ్బందిని పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ము ఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, తహశీల్దార్ ఆర్ వెంకటేశ్వరరావు, కొప్పుల బాబ్జి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రాచపల్లి కృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు పాల్గొన్నారు. ప్రత్తిపాడులో తన నివాసంలో ఎమ్మెల్యేను జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వరరావు, ప్రత్తిపాడు, గొల్లప్రోలు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, వి.శివప్రసాద్,సీఆర్పీల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ట్రైనీ కలెక్టర్ పరిశీలన

పెద్దాపురం, ఆగస్టు 29: స్థానిక తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న రికార్డు రూములను ట్రైనీ కలెక్టర్ భావన గురువారం పరిశీలించారు. పలు చర్యలపై తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మిని అడిగారు. ఆర్‌బీపట్నం సంబంధించి రిజిస్ట్రేషన్ జరుగుకపోవడానికి కారణాలను తెలుసుకున్నారు. టీడీ కాంతారావు తదితరులు ఉన్నారు.

వరలక్ష్మీ వ్రత పూజలకు ఏర్పాట్లు

పోర్టు సిటీ (కాకినాడ), ఆగస్టు 29: నగరంలో దేవాలయం వీధిలోని శ్రీ బాలాత్రిపురసుందరి సమేత శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రత పూజలకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం కోసం దేవాలయ అధికారులు ప్రత్యేక కూపన్లు ముద్రించారు. కానీ వాటిలో అత్యధిక శాతం కూపన్లు ఒకే సామాజికవర్గానికి చెందినవారికి కేటాయించారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు న్యాయం జరగాలని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మహిళా భక్తులు కోరుతున్నారు.

ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు : ఎమ్మెల్యే రాజప్ప



తూర్పుపాకలు గ్రామంలో పర్యటిస్తున్న రాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 29: ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని తూర్పుపాకలు, మర్లావ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు అందించే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. తాగునీటి ట్యాంకుల నిర్మాణం కోసం పెద్దఎత్తున నిధులను కేటాయించడం జరుగుతందన్నారు. కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), ఎలిశెట్టి నాని, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి'

పిఠాపురం రూరల్, ఆగస్టు 29: గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. నవఖండ్రవాడలోని హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. గ్రామసభలో చేసిన తీర్మానానికి అనుగుణంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ డీఈఈ ఎల్.శ్రీనివాస్, ఏఈ నగేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమరాజు, బల్ల రమణ ఉన్నారు.

మహిళకు ఆర్థిక చేయూత



కాకినాడ రూరల్, ఆగస్టు 29: రూరల్ మండలం రేపూరుకు చెందిన ఎలుగుబంటి సత్య అనే మహిళకు రెండు కిడ్నీలు ఫెయిలవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స చేయించుకోలేని పరిస్థితిలో ఉండడంతో కేటీసీ పాఠశాల అధినేత ప్రవీణ్‌చక్రవర్తి రూ.40,000 సమకూర్చారు. ఈ నగదును రూరల్ మండల జనసేన నాయకులు పాండ్రంకి రాజు, తోట వేణు చేతులమీదుగా అందజేశారు. బాధితురాలు ప్రవీణ్ చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే దాట్ల పరామర్శ

తాళ్లరేవు, ఆగస్టు 29: టీడీపీ నేత, తాళ్లరేవు ఆసుపత్రి కమిటీ సభ్యుడు రేళ్ల శ్రీనివాస చక్రవర్తి తండ్రి రేళ్ల వెంకయ్యనాయుడు ఇటీవల మృతిచెందడంతో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరామర్శించారు. వెంకయ్యనాయుడు చిత్రపటానికి నివాళిలర్పించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, వినోద్ ఉన్నారు.

రక్తదాన శిబిరం

తాళ్లరేవు, ఆగస్టు 29: కోరింగ ఫార్మసీ కళాశాలలో కాకినాడ రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పి.కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్, రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

తొండంగి, ఆగస్టు 29: పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ప్రధానోపాధ్యాయులు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారిలో గోతులు పూడ్చివేత

కోటనందూరు, ఆగస్టు 29: తుని-నర్సీపట్నం రహదారిలో ఆర్అండ్‌బీ అధికారులు గోతులు పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ రహదారిలో గుంతల్లో పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కాకరపల్లి గ్రామానికి చెందిన జనసేన నేతలు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్అండ్‌బీ జేఈ దగ్గర ఉండి గోతులు పూడ్చివేయించారు.

గణేష్ ఉత్సవాలకు రాట ముహూర్తం

కొత్తపల్లి, ఆగస్టు 29: కొత్తపల్లి పోలమ్మ గుమ్మం సెంటర్లో 39వ వినాయక వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం వినాయకచవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఇందుకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

జగ్గంపేట రూరల్, ఆగస్టు 29: మామిడాడ గ్రామ శివారున పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

బూరుగుపూడిలో కబడ్డీ పోటీలు

కిర్లంపూడి, ఆగస్టు 29: బూరుగుపూడిలో కబడ్డీ పోటీలను టీడీపీ నాయకులు కుంచే తాతాజీ, పాటంశెట్టి విశ్వనాధం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జగిగాయి. ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ మూరా సత్తిబాబు,కూటమి నేతలు పోటీల్ని పర్యవేక్షించారు.

పైడితల్లి అమ్మవారి జాతర

కిర్లంపూడి, ఆగస్టు 29: జగపతినగరంలో పైడితల్లి అమ్మవారి జాతరను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, ఎంపీటీసీ ఆళ్ల నానాజీ, వార్డు సభ్యులు ఆళ్ల శ్రీమన్నారాయణ, సరిసే శివ, ఎల్లపు చిన్న, చదరం శ్రీను పాల్గొన్నారు.